క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎస్‌ఐ



ఎస్పీని కలిసిన ముచ్చుమర్రి ఎస్‌ఐ

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని ముచ్చుమర్రి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.జయశేఖర్ శనివారం మర్యాద పూర్వకరంగా కలిశారు. కర్నూలు జిల్లా ఆదోని మూడవ పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదీల్లో భాగంగా ముచ్చుమర్రికి బదిలీ అయ్యారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు శనివారం ప్రత్యే పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు తెల్లవారుజామునే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేసి పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు విశేష పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు.

నవరత్నాలు దేశానికే ఆదర్శం


ప్రచారం నిర్వహిస్తున్న గంగుల అవంతిరెడ్డి

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గంగుల అవంతిరెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యానగర్, చలమయ్య వీధుల్లో ఆమె ఇంటింటికీ ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేవలం అర్హత ఆధారంగా పథకాలు అమలు చేసి నూతన విధానానికి జగనన్న రూపకల్పన చేశారన్నారు. అందరికీ న్యాయం చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, జనీర్, రమేష్‌గౌడ్,న్యాయవాది సరిత ఉన్నారు.

దోమల నివారణకు..


పొన్నాపురం కాలనీలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పొన్నాపురం కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టినట్లు వార్డు ఇన్‌చార్జి శ్రీరాములు తెలిపారు. రెండు మిషన్ల ద్వారా 12 వీధుల్లో శనివారం ఫాగింగ్ చేశామన్నారు. దోమల నివారణకు ఇంతకు ముందు మూడు విడతలుగా ఫాగింగ్ చేయడంతో దోమలను కొంత వరకు నివారించగలిగామన్నారు.

'శూన్యపు మనసులో చిగుర్లు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

నంద్యాల(వ్యవసాయం): కవి కొప్పుల ప్రసాద్ రచించిన శూన్యపు మనసులో చిగుర్లు పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల మినీ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సాహితీ స్రవంతి అధ్యక్షుడుశ్రీనివాసమూర్తి, రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ హాజరై మాట్లాడుతూ కళా సాహిత్య రంగాల్లో నంద్యాలకు ప్రత్యేక స్థానం ఉందని, కవి కొప్పుల కవితా రచనలు, సామాజిక ప్రయోజనంతో కొనసాగడం హర్షనీయమన్నారు. అనంతరం కొప్పుల ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. సాహితీవేత్తలు హరికిషన్, గెలివి సహదేవుడు, హుసేన్‌రెడ్డి, సుబ్బయ్య, అన్నెం శ్రీనివాస రెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు రంగనాథస్వామి కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవ నగర్‌లో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో ఈనెల 14వ తేదీన గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని శ్రీ భగవత్ సేవా సమాజ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరయ్య, మధుసూదన రావు శనివారం తెలిపారు. ఆలయంలో ధనుర్మాసం ముగింపు వేడుకలను పురస్కరించుకొని కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 9.30 గంటలకు లోక కల్యాణార్థం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వార్లకు పట్టణంలో రథోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రథోత్సవం శ్రీనివాససెంటర్, నాగులకుంట రోడ్డు, వివేకానంద సెంటర్, గాంధీచౌక్ మీదుగా సాగుతుందన్నారు. శ్రీనివాస్, తులసీకృష్ణ, గురుప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు

వైద్యం ఒకప్పుడు: ఐదేళ్ల క్రితం వైద్య సేవలను గుర్తు చేసుకుంటే గుండె దడ మొదలవుతుంది. ముఖ్యంగా గ్రామీణుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉండేది. అక్కడ పేరుకు మాత్రమే ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండేవి. అందులో అరకొరగా వైద్యులు, సిబ్బంది, మందులు అంతంత మాత్రంగానే ఉండేవి. దీంతో వైద్యం అందని ద్రాక్షగా మారింది. చిన్న రోగమొచ్చినా స్థానికంగా ఉండే ఆర్ఎంపీల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. లేకపోతే పట్టణాలకు వెళ్లేవారు. ఇందుకు రోడ్లు,రవాణా సౌకర్యాలు కరువాయే. సకాలంలో వైద్యం అందక మంచాలపై మగ్గాల్సిన దుస్థితి.


చిన్నకంబలూరులో శిథిలావస్థకు చేరిన ఆరోగ్య ఉపకేంద్రం

ప్రస్తుతం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. మండల కేంద్రాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం వైద్య సేవలను విస్తరింపజేశారు. ఆరోగ్య ఉప కేంద్రాల స్థానంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. అందులో నిత్యం అందుబాటులో ఉండేలా వైద్య సిబ్బంది, 108 రకాల మందులు, 12 రకాల వైద్య పరీక్షలు చేయించుకునేలా వసతులను కల్పించడంతో గ్రామీణులు వైద్యం కోసం పట్టణాలకు రావడం తగ్గింది.


కోటకొండలో నిర్మించిన హెల్త్ క్లినిక్

- పల్లె ముంగిట నాణ్యమైన వైద్యసేవలు
- గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- అందుబాటులో 108 రకాల మందులు, 12 రకాల వైద్య పరీక్షలు
- ప్రజలకు తప్పిన అగచాట్లు


ర్యాక్‌లో ఉన్న మందులు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు,నర్సాపురం,ఆలమూరు గ్రామాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు ఉండేవి. వాటి పరిధిలో పలు గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండేవి. అప్పట్లో పీహెచ్‌సీలకు వైద్యులు ఎప్పుడొస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. ఇక పల్లెల్లో వైద్యం అందించే నెపంతో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్వాహణ కోసం అక్కడక్కడ సొంత భవనాలు సైతం నిర్మించినా వైద్యం అందని ద్రాక్షే. ఇక భవనాలను పట్టించుకోకపోవడంతో అవి కాలక్రమేణా శిథిలమై కూలిపోయాయి.

ఇది కదా.. అభివృద్ధి

కొన్నిచోట్ల హెల్త్ అసిస్టెంట్లు చుట్టపుచూపుగా వారానికో, నెలకోసారి ఆయా గ్రామాల వైపు అలా వచ్చి వెళ్లేవారు.

అందుబాటులో లేని మందులు ..

కుక్క, కోతి కరిస్తే ఆయా ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేవి కాదు. జిల్లా అధికారులకు స్థానిక వైద్యాధికారులు ఇండెంట్ పెట్టినా నెలలు గడిచినా రాని పరిస్థితి తప్పని పరిస్థితుల్లో పట్టణాలకు వెళ్లి చికిత్స చేయించుకునేవారు. ఇక పొలాల్లో విష పురుగులు కాటేస్తే స్థానిక ఆసుపత్రులకు వెళ్తే ప్రాణాలు పోతాయని జనం రెండో ఆలోచన లేకుండా పట్టణాలకు పరుగులు తీసేవారు.


కోటకొండ హెల్త్ సెంటర్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

ప్రస్తుతం..

ప్రస్తుతం ఇందుకు భిన్నమైన పరిస్థితి. పీహెచ్‌సీల్లో కాన్పులు, సిజేరియన్‌లు సైతం చేస్తున్నారు. అత్యాధిక వైద్య పరికరాలు, వివిధ రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చారు. ఇక వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటుండటం, అన్ని రకాల మందులు, వ్యాక్సిన్లు పుష్కలంగా ఉంటుండటంతో స్థానిక ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందుతోంది. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేశారు. దాదాపు రూ.20 లక్షలు వెచ్చించి ఎర్రగుడిదిన్నె, చిత్రేనిపల్లె, కోటకొండ గ్రామాల్లో నూతన భవనాలు నిర్మించగా ఎల్లావత్తుల,చిన్నకంబలూరు, మందలూరు, పేరూరు,ముత్తలూరు,తిప్పారెడ్డి పల్లె తదితర గ్రామాల్లో పాత సొంత భవనాల్లో హెల్త్ సెంటర్ల నిర్వాహణ సాగుతోంది. ఇంకొన్ని గ్రామాల్లో నూతన భవనాల నిర్మాణాలు సాగుతున్నాయి. హెల్త్ సెంటర్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటున్నారు. నిత్యం ఒక్కో హెల్త్ సెంటర్లో 50 నుంచి 60 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు.

రూపాయ ఖర్చు లేకుండా వైద్యం



జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క రూపాయ ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందుతోంది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకురావడంతో తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. చిన్న జ్వరమొచ్చినా ఆర్ఎంపీలకు బదులు వాటిల్లోనే చికిత్స చేయించుకుంటున్నాం. నాణ్యమైన వైద్యం, ఉచితంగా మందులు అందుబాటులోకి తెచ్చిన జగనన్నకు కృతజ్ఞతలు.

– నరసింహారెడ్డి, డీ.కొట్టాల

అవస్థలు తప్పాయి



వైద్య పరంగా గతంలో ఎన్నో అవస్థలు పడ్డాం. సకాలంలో వైద్యం అందక పట్టణాల్లో ఉన్న పెద్ద ఆసుపత్రులకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక రోగాలతో మంచం పట్టి అలమటించే వాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం చర్యలతో ఆ అవస్థలన్నీ పోయాయి. తమ ఇళ్ల వద్దకే వైద్యం అందేలా చర్యలు చేపట్టడం అభినందనీయం. – నరసింహయ్య, చిత్రేనిపల్లె

గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు



పేదలకు అత్యవసరమైన వాటిలో వైద్యం ఒకటి. దానిని గుర్తించిన ప్రభుత్వం వైద్యం అందుబాటులో ఉండాలని గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యసేవలందేలా చర్యలు చేపట్టడం అభినందనీయం. గ్రామంలోనే అన్ని రకాల మందులు, వ్యాక్సిన్లు ఉచితంగా అందజేస్తున్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి వ్యాక్సిన్ వేయించుకోవాలని అవగాహన కల్పిస్తుండటం బాగుంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నకంబలూరు

టీడీపీ మునిగిపోయే నావ


తుడుమలదిన్నెలో లబ్ధిదారుకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ : టీడీపీ మునిగిపోయిన నావ అని ఎంత మంది వచ్చి లాగినా ఒడ్డుకు చేర్చలేరని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామ సచివాలయ పరిధిలోని తుడుమలదిన్నె, గోవిందపల్లె గ్రామాల్లో జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచ్ చామల ఉమాదేవి, మాజీ గ్రామ సర్పంచ్‌లు శింగిరెడ్డి దస్తగిరిరెడ్డి, పేరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు అంబటి ఈశ్వరయ్య, దివాకర్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందించారు. ప్రస్తుతం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే నినాదంతో మోసం చేసేందుకు టీడీపీ నాయకులు మరోసారి ముందుకు వస్తున్నారని అలాంటి మాటలకు మోసపోవద్దని ప్రజలను కోరారు. దేశంలోనే ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మరో సారి జగనన్నను ఆశీర్వదించాలని పిలుపు నిచ్చాని కోరారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో సచివాలయం పరిధిలో 2,907 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా రూ. 9,39,65,869 వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. పరోక్షంగా 961 మందికి రూ. 3,71,14,104 జమ చేసిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, నంద్యాల మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దేశం సుధాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చెన్నూరు భాస్కర్‌రెడ్డి, ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జేసీసీ కన్వీనర్ లాలమ్మ గారి హుసేనయ్య పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి కొనసాగింపు


లబ్ధి పొందిన పథకాలను మహిళకు చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

గోస్పాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమాభివృద్ధి కొనసాగింపు సాధ్యమని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పసురపాడు, శ్రీరాంనగర్ గ్రామాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే సమస్యలను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనకు ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నా, ఎల్లో మీడియా, టీడీపీ నాయకులకు మాత్రం అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదన్నారు.గతంలో రాజకీయ నాయకుడు వస్తున్నాడంటే సమస్యలు స్వాగతం పలికేవని, ప్రస్తుతం సంక్షేమ ఫలాలతో ప్రతి కుటుంబం కళకళలాడుతుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా గ్రామాల్లో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ గడ్డం లలితమ్మ, ఎంపీటీసీ ఆళ్లగడ్డ భక్తవత్సలరెడ్డి, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి, నాయకులు బొబ్బిటి దామోదర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌యాదవ్, బీమలింగేశ్వరరెడ్డి, పుల్లయ్య, శివుడు, సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేసిన దృశ్యం


సీతారాముల తెప్పోత్సవం నిర్వహించేందుకు సిద్ధంగా కోనేరు

పల్లెల్లో సం'క్రాంతి'

దొర్నిపాడు: పల్లెల్లో సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది. ఇప్పటికే బంధువులు, మిత్రులు దూర ప్రాంతాల నుంచి గ్రామాలకు చేరుకుంటున్నారు. ముఖ్యంగా మండలంలోని రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, భాగ్యనగరం, వెంకటేశ్వరనగరం, ఉమాపతినగరం గ్రామాల్లో సంక్రాంతి పండగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఆదివారం భోగి సందర్భంగా ఇళ్లు, ఆలయాల ముందు ముగ్గులు వేసి గొబ్బిళ్లను ఉంచుతారు. పండుగ సందర్భంగా సోమవారం సీతారాముల ఆలయంలో ఉత్సవమూర్తులకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం ఉత్సమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించి తెప్పోత్సవం చేపడతారు. మంగళవారం సరదాగా పొట్టేళ్ల పందేలను నిర్వహించి వేడుకలను ముగిస్తారు.

వాడ వాడలా అభివృద్ధి

నంద్యాల(సిటీ): పట్టణంలో వాడ వాడను అభివృద్ధి చేసి చేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసాతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

- 13వ వార్డులో రూ.26లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లను కౌన్సిలర్ కాల్వ సరస్వతి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కాల్వ నాగరాజుతో కలిసి ప్రారంభించారు.
- 14వ వార్డులో రూ.45లక్షలతో డ్రైనేజీని కౌన్సిలర్ విమలమ్మ, వార్డు ఇన్‌చార్జ్ సోమశేఖర్ రెడ్డితో ప్రారంభించారు. ఇదే వార్డులో మరో రూ.45లక్షలతో మరో డ్రైన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.


14వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రోజూ ఏదో ఒక వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నామన్నారు. 14వ వార్డుల్లో ప్రజల సౌకర్యార్థం డ్రైనేజీ నిర్మాణానికి తమ సొంత స్థలాన్ని దానం చేసిన శివనాగిరెడ్డి ఉదార స్వభావానికి అభినందనలు తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మున్సిపల్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, రామసుబ్బయ్య, ప్రసాద్, నాగరాజు, శివయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ చక్రవర్తి, సత్యమయ్య, గెలివి రామకృష్ణ, మురళీ పాల్గొన్నారు.

16న పాదయాత్రగా తిరుమలకు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 16వ తేదీన నంద్యాల నుంచి తిరుమలకు పాదయాత్రతో బయల్దేరుతున్నట్లు గణపతి మిత్ర మండలి సభ్యులు చలంబాబు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన ఈ యాత్ర విజయవంతంగా సాగుతుందని, రోజుకు 35 కి.మీ. నడుస్తూ మొత్తం 8రోజులకు తిరుమలకు చేరుకుంటుందని చెప్పారు. పాదయాత్రగా వచ్చే వారు సెల్: 9393933577 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చీరల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పేద మహిళలకు బీజేపీ నాయకుడు అభిరుచి మధు శనివారం కార్యాలయంలో చీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగ రోజున సంతోషంగా ఉండాలని కోరుతూ చీరల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. నాయకులు షబానా, స్వాతి, శిల్పా, జ్యోతి, పట్టణ అధ్యక్షుడు కొలెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెల్విన్ జోన్స్ జయంతి

నంద్యాల(వ్యవసాయం): అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు మెల్విన్‌జోన్స్ జయంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి లయన్స్‌క్లబ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ సేవా సంస్థ ద్వారా ప్రపంచంలోని అన్ని దేశాల్లో సేవా కార్యక్రమాలను వంద సంవత్సరాలకు పైగా నిర్వహిస్తున్నారని చెప్పారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకుడు గోళ్ల రాజేష్ దివ్యాంగులకు రూ.20వేలు విలువజేసే చంక కర్రలను, అలాగే దివ్యాంగ విద్యార్థులకు వేతనాలు పంపిణీ చేశారు. నాగరాజు, చంద్రమోహన్, రమణయ్య, మురళీమోహన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): జిల్లా దివ్యాంగ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో శనివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా మురహరిరావు, అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా జారుద్దీన్, కోశాధికారిగా జలీల్, ఉపాధ్యక్షులుగా షహినూర్, స్రవంతి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, వీరన్న, అనీఫ్, డిజేబుల్ రైట్స్ అసోసియేషన్ మస్తాన్‌వలి, మరియదాసును ఎన్నుకున్నారు. అనంతరం నిరుపేద దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

పేదలకు అత్యున్నత వైద్య సేవలు

- సర్వజన ఆసుపత్రిలో రూ.5.11 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం
- ఓపీ రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు


డీఈఐసీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాలటౌన్: పేదలకు అత్యున్నత వైద్యసేవలందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని ఇందులో భాగంగా వైద్య రంగంల విప్లవాత్మక మార్పులు చేపట్టారని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల సర్వజన హాస్పిటల్‌లో రూ.5.11 కోట్లతో నిర్మించిన వివిధ అభివద్ధి పనులను ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. రూ.1.06 కోట్లతో నూతనంగా నిర్మించిన బాలల సత్వర చికిత్స కేంద్రం, మెడికల్ కళాశాలకు రూ.1.50 కోట్లతో నిర్మించిన లెక్చరర్ హాల్, ఓపీ రిజిస్ట్రేషన్ సెంటర్లను ప్రారంభించారు.

నంద్యాలను అగ్రస్థానంలో నిలుపుదాం..

ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య రంగంలో నంద్యాలను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వివిధ వసతులను కల్పించిందన్నారు. ఓపీ రిజిస్ట్రేషన్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామని ఇక నుంచి పేదలకు అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. త్వరలో నంద్యాలలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించి, నంద్యాల కళాశాలకు ఖ్యాతి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా మాట్లాడుతూ సీఎం జగనన్న వైద్య రంగంలో చరిత్రాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఇంటింటికి వైద్య సేవలను, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, దృశ్యకళల డైరెక్టర్ సునీత అమతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్, డీసీహెచ్ఎస్ జఫరుల్లా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత, డా.మహబూబ్ బాషా పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్

అయోధ్య అక్షితల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అరుంధతి నగర్‌లో కన్వీనర్ చింతలపల్లె వాసు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి అయోధ్య అక్షితలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ఆ రోజు సాయంత్రం ఇంట్లో దీపారాధనలు నిర్వహించి హారతులు ఇవ్వాలని కోరారు. నరసింహ, ఎల్లప్ప, నరేంద్ర, రమేష్, సుబ్బారావు, బాలవీరయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.


దొర్నిపాడు శివారులో పచ్చదనం పులుముకున్న ఆవాల పంట


రామచంద్రాపురం పొలాల్లో విరబూసిన తెల్లబంగారం

మెరుస్తున్న పంటలు

దొర్నిపాడు: వర్షాభావ పరిస్థితులు పంటల దిగుబడులకు అనుకూలంగా మారాయి. రబీలో సాగు చేసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఇటీవల రైతులు వరి కోతల అనంతరం పొలాల్లో ఆవాలు చల్లారు. అంతే పంట ఏపుగా పెరిగి పూత దశలో ఉంది. దీంతో కనుచూపు మేర పచ్చటి పూతతో ఆకట్టుకుంటోంది. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముందని, క్వింటా రూ.8వేల ప్రకారం పలుకుతోందని దీంతో రూ.16వేలు వస్తుందని రైతులు సంబర పడుతున్నారు. కాగా ఆవాల సాగుకు పెట్టుబడి పెద్దగా ఉండదు. ఇక మందులు, ఎరువులు అవసరం లేకుండా వరి పైరు సమయంలో పెట్టిన నీటి తడులతో పంట పండిపోతుంది. అలాగే పత్తి పలుచోట్ల విరగబూసింది. తోటంతో తెల్లగా విడిన పత్తిని చూసి రైతులు సంబరపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ధర రూ.9వేలు పలుకుతుందని చెబుతున్నారు.